# చుట్టాలొచ్చారు

ఆరోజు సారథి మంజుల వాళ్ళింటికి పార్టీకి వెళ్ళాం. మేం వెళ్ళేసరికే సీత, సీతాపతి, రాధ, కృష్ణ, లక్ష్మి, లక్ష్మీపతి కూడా అక్కడే వున్నారు.

"సారీ ఫర్ ది డిలే..." అంటూ నేనూ, లలిత లోపలికి వెళ్ళాం.

మైసూరు బోండాలు అక్కడ టీపాయ్ మీద వున్నాయి. పక్కనే వున్న ప్లేట్‌లో రెండు బోండాలు పెట్టుకుని కాస్త చట్నీ వేసుకుని తింటూ కూర్చున్నాను.

"ఏమిటి ఈ మధ్య కనపడటం లేదు" అడిగాను సీతాపతిని.

సీతాపతి అన్నాడు "ఏమీ లేదు. మా ఇంటికి చుట్టాలొచ్చి మొన్ననే వెళ్ళిపోయారు" అన్నాడు.

"ఎవరు, సిన్సినాటీనించీ మీ అక్కయ్యగారు వచ్చారా" అడిగింది లలిత.

"అమెరికా చుట్టాలు కాదు. ఇండియానించి. మావారి మేనమామగారూ, అత్తయ్యగారూ..." అంది సీత.

"ఇండియా చుట్టాలా? దటీజ్ గుడ్! మనకి ఎప్పుడో కానీ ఇండియా చుట్టాలు రారు. యు మస్ట్ హావ్ హాడ్ ఎ వెరీ గుడ్ టైమ్" అన్నాను.

"అవును. మా అత్తయ్యా వాళ్ళు అమెరికా రావటం మొదటిసారి. వాళ్ళు చూస్తామన్నవన్నీ చూపించాం. ఇప్పుడు మా అక్క దగ్గరికి సిన్సినాటీ వెళ్ళారు" అన్నాడు సీతాపతి.

"మా అన్నయ్యా వదినా వచ్చారు పోయిన సంవత్సరం. ఆయనదదో తరహా. ఇండియాలో కమ్యూనిష్టు పార్టీలో కొన్నాళ్ళు తిరిగాడులే. ఇక్కడికి వచ్చిన మొదటి మూడు రోజులూ మాటలతో కోటల మీద ఎర్రజెండా ఎగరేశాడు కానీ, తర్వాత నెల రోజుల్లో పూర్తిగా మారిపోయాడు" అన్నాడు లక్ష్మిపతి.

"అంటే ఏం చేశారేమిటి?" అడిగాడు సారథి.

"ఏం చేశాడా. ఇక్కడికి రాగానే అన్నీ రష్యాతో పోల్చటం మొదలుపెట్టాడు. సూపర్ మార్కెట్లు ఒకదాని మీద ఒకటి పోటీ పడి ధరలు తగ్గిస్తుంటే ఆశ్చర్యపోయాడు. అదేమిట్రా ఇలా చేస్తే వీళ్ళకి లాభాలు వస్తాయా అంటాడు. ఇంత చేసినా వాళ్ళ ఫైనాన్షియల్ రిపోర్టుల్లో లాభాలు చూస మళ్ళీ ఆశ్చర్యపోయాడు"

లక్ష్మి నవ్వుతూ అంది "మా బావగారు అంతకన్నా ఆశ్చర్యపోయింది ఇక్కడి రోడ్లను చూసి. వీళ్ళ దుంపతెగ ఇటు నాలుగు, అటు నాలుగు మొత్తం ఎనిమిది లైన్లా? అన్ని కార్లు వెడుతున్నా ఒక్కడూ హారన్ కొట్టడేమిటమ్మాయ్

అన్నారు నాతో... "

"మా అన్నయ్యకి ఏదొచ్చినా పట్టలేడు. ఒరే! ఈ మధ్య ఉద్యోగాలు పోతున్నా, ఇంకా మనవాళ్ళనందర్నీ తీసేసి వాళ్ళవాళ్ళకి ఉద్యోగాలు ఇవ్వచ్చు కదురా అలా చేయటల్లేదేం అన్నాడు. కాస్తో కూస్తో డిస్క్రిమినేషన్ వున్నా ఈ కాపిటలిస్ట్ కార్పొరేట్ ప్రపంచంలో లాభాలే ముఖ్యమనీ, ఎవరు బాగా పనిచేసి ఆ లాభాలు తెచ్చి పెడుతుంటే వాళ్ళ ఉద్యోగాలకి ఢోకా లేదనీ, ఒకవేళ పోయినా ఇంకో చోట రావటం పెద్ద కష్టం కాదని చెప్పాల్సి వచ్చింది. అంతే కాదు ఇక్కడ ప్రొడక్టివిటీ ఎక్కువగా వుండటం, బందులూ హర్తాళ్ళూ లేకపోవటం ఆయన్ని ఆశ్చర్య పరిచింది... మొత్తానికి ఇక్కడినించీ వెళ్ళేటప్పటికి ఆయన ధోరణిలో మార్పు వచ్చింది" అన్నాడు లక్ష్మీపతి.

"ఆయనకి చాల ఎనలిటికల్ మైండ్ వుంది. ఏది చూసినా క్షుణ్ణంగా పరిశీలిస్తారు.. " అంది లక్ష్మి

సీతాపతి పెద్దగా నవ్వాడు "కాని మా మామయ్య సంగతి వేరు. ఆయనదంతా పాత పద్ధతి. మొదట్లో మేమూ మా పిల్లలూ అందరం మామయ్య అత్తయ్యలతో కలిసి భోజనం చేసేవాళ్ళం. రెండు రోజులు కాగానే మా పిల్లలు హోంవర్క్ చేసుకోవాలనే నెపంతో గబగబా ముందుగానే తినేసి, వాళ్ళ గదుల్లోకి వెళ్ళిపోయేవారు.. " అన్నాడు.

"ఎందుకని?" అడిగాను.

ఒక్కక్షణం ఎలా చెప్పాలా అని ఆలోచించి నెమ్మదిగా అన్నాడు సీతాపతి. "చెప్పానుగా ఆయన పాతకాలం మనిషని. గోంగూర పచ్చడి కలుపుకు తింటూ ఒక్కొక్క వేలూ నాకుతుంటాడు. ఐదు వేళ్ళూ నాకేక అరిచేయి నాకుతాడు. మామూలుగా కాదు, ప్చ్ ప్చ్ అని శబ్దం చేసుకుంటూ మరీనూ..... మధ్య మధ్యలో నోట్లో చూపుడు వేలు పెట్టుకుని పళ్ళ మధ్య ఇరుక్కున్న కూర ముక్కల్ని తీసి, డైనింగ్ టేబుల్ మీద పడేస్తాడు. అంతేకాదు చేయి కడుక్కోగానే పెద్దగా బ్రేవ్‌బ్రేవ్‌మని తేపుతాడు. అప్పటికీ మాఅత్తయ్య ఆయన్ని మందలిస్తూనే వుంటుంది అలా చేయద్దని. ఆయన ఆవిడ మాటలు వినకపోగా నవ్వుతూ... త్రేపుని ఇంగ్లీష్‌లో ఏమంటారో తెలుసా.... సౌండ్ ఆఫ్ శాటిస్‌ఫాక్షన్ అని. అది వస్తేనే కానీ తృప్తిగా వుండదు అంటాడు" అని పెదగా నవ్వాడు సీతాపతి.

సీత అంది "ఇక్కడి పిజ్జా రుచి చూపిద్దామని, ఒకరోజు రాత్రి ఏడున్నరకి పిజ్జా తెప్పించాం. వాళ్ళకి బాగుందది. మామయ్యగారు మిరపకాయల పొడి దాని మీద చల్లుకుని కారంకారంగా బాగుందని మెచ్చుకున్నారు. ఆ రోజు రాత్రి తొమ్మిదయిందేమో. అత్తయ్యగారు వచ్చి ఏమిటమ్మా ఇంకా అన్నం పడేయలేదు. ఆలస్యమయిపోవటం లేదూ.. నెను పడేయనా.. అన్నారు ఇందాక తిన్న పిజ్జాయే రాత్రి భోజనం అని చెబితే బాగుండదని, చకచకా అన్నం కూర చేయాల్సివచ్చింది"

"సుబ్బారావ్‌గారింట్లో వాళ్ళబ్బాయి పుట్టినరోజు పార్టీకి వెళ్ళామందరం. సాయంత్రం ఏడు గంటలకి కేక్ కట్ చేస్తాం రమ్మన్నారాయన. మా మామయ్యతో

సాయంత్రం బయటికి వెడుతున్నాం ఆరున్నరకి బయల్దేరి ఏడుగంటలకి అక్కడ వుండాలి అని చెప్పాను. ఆరింటికి మళ్ళీ ఒక్కసారి గుర్తుచేసి, నేనూ సీతా తయారయి ఆరూ ఇరవై అయిదుకి లివింగ్ రూమ్‌లోకి వచ్చాం. మామయ్య అక్కడే కూర్చుని సోఫాలో నిద్ర పోతున్నాడు ఆయనకి మూడు గంటలకొకసారి ఒక పావుగంట నిద్రపోవటం మొదటినించీ అలవాటు. అత్తయ్య ఇంకా జడ వేసుకుంటూ వుంది. ఇంకా రెడీ అవలేదా అన్నాను. ఆ! అయిపోయిందిరా ఎంతసేపు అంటూ ఇద్దరూ లేచి, ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు బాత్రూమ్‌కి తయారయి బయటికి వచ్చే సరికీ ఏడుంబావయింది. మేము పార్టీకి వెళ్ళేసరికి కేక్ కట్‌చేయటమే కాక అందరూ భోజనాలు కూడా మొదలు పెట్టారు..."

కృష్ణ నెమ్మదిగా నవ్వుతూ అన్నాడు. "నాలుగేళ్ళ క్రితం మా నాన్న అమ్మా వచ్చారు కదా. మా అమ్మకి పిల్లలతో మంచి కాలక్షేపమయింది కాని మా నాన్నతోనే గొడవ. ఆయనకి విపరీతంగా బోరుకొట్టేది. సరదాగా ఊళ్ళు చూపిద్దామంటే, ఆయనకి గుళ్ళూ గోపురాలూ తప్ప ఇంకేమీ అక్కర్లేదు చుట్టుపక్కల వున్న గుళ్ళన్నీ చూపించాను. బలవంతాన సైట్ సీయింగ్‌కి తీసుకువెడితే నా కోసం వచ్చేవాడే కాని తనకోసం మాత్రం కాదు...." అన్నాడు.

వీళ్ళందరి మాటలూ వింటుంటే నాకు మా అమ్మ అమెరికా వచ్చి మాతో గడిపిన రోజులు గుర్తుకొచ్చాయి. అవిడ ఇక్కడ వున్నది నాలుగు నెలలే అయినా మధుర స్మృతులంటారే అవీ.. ఆ జ్ఞాపకాలు. పెద్దవాళ్ళతో పెద్ద తరహాగా వుండేది, పిల్లలతో బాగా కలిసిపోయేది. తన పనేదో తను చూసుకునేది. రోజూ స్నానం, పూజ, రామకోటి వ్రాసుకోవటం. నా లైబ్రరీలోని తెలుగు పుస్తకాలు చాల చదివేసింది కూడాను. అటు పిల్లలతో కబుర్లు. ఇటు వంటింట్లో సహాయం చేయటం. సాయంత్రం నాతోపాటూ మా పెరట్లో దొండకాయలు దోసకాయలూ కోయటం. మొక్కలకి నీళ్ళు పెట్టటం. రోజూ సాయంత్రం మాతో పాటూ కూర్చుని "బిల్ కాస్బి" షో కూడా చూసేది. ఆవిడకి ఇంగ్లీష్ సరిగ్గా అర్థం కాదని, నేను కథ చెబుతుంటే వినేది. తర్వాత తర్వాత, నేను ఆలస్యంగా ఇంటికి వస్తే ఆరోజు ఎపిసోడ్‌లో ఎం జరిగిందో కూడా నాకు చెప్పేది. అంతగా ఆ షోలో లీనమయిపోయిందావిడ

"భోజనం చేద్దాం లేవండి" అంటున్నది మంజుల.

"రండి. నాకూ ఆకలేస్తున్నది" అంటూ లేచాడు సారథి.

"అన్నదాతా సుఖీభవ!" అంటూ లేచాడు లక్ష్మీపతి.

"అన్నదాతే కాదు. తిన్నదాత కూడానూ" అంటూ లేచాడు సీతాపతి.

ఈలోగా ఫోన్ మోగింది. మంజుల ఫోన్ తీసుకుని మాట్లాడింది.

ఫోన్ పెట్టేసి, "మనింటికి చుట్టాలొస్తున్నారు. ఇప్పుడే మీ మేనల్లుడు ఫోన్ చేసాడు అట్లాంటానించి. మీ అక్కయ్యగారు బావగారూ వస్తున్నారుట ఇండియా నించి...." అంది సారథితో మంజుల.

* * *